పల్నాడును ముంచెత్తిన వాన

- రోడ్లు జలమయం
- ఇళ్లలోకి చేరిన నీరు
- లోతట్టు ప్రాంతాలు జలమయం

మాచర్ల: పల్నాడును భారీ వర్షాలు ముంచెత్తాయి. పలు పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. సోమవారం ఉదయం నుంచి కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగు కాల్వలు పొంగి పొర్లాయి. మురుగు నీరంతా రోడ్లుమీదకు పారుతోంది. మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుండటంతో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో పారిశుధ్యం దిగ జారింది. కుండపోత వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు చేరడంతో దుర్వాసనతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే, ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కారెంపూడిలో..

మండలంలో సోమవారం సాయంత్రం 50 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో నాగులేరుతో పాటు ఇతర వాగులకు జలకళ వచ్చింది. నాగులేరుకు వరద నీరు సింగరుట్ల తండా వరకు వచ్చింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది. నీరింకిన బోర్లలో నీరు వస్తుందనే ఆశ కలిగింది. బెట్టకు వచ్చిన పత్తి ఇతర పంటలకు వర్షం జీవం పోసింది. కారెంపూడి బాలభాను విద్యాలయం పక్క బజారులో ఇళ్లలోకి నీరు చేరింది. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి.


గురజాలలో కురుస్తున్న వర్షం


గామాలపాడు వద్ద వాగులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

గురజాలలో..

పట్టణంలో సోమవారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఉక్కపోతతో కూడిన ఎండ రావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. అయితే, ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వెంటనే ఉరుములు, మెరుపులుతో కూడిన వర్షం కురిసింది. దీంతో ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారిపై వర్షం నీరు నిలవడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

దాచేపల్లిలో..

మండల వ్యాప్తంగా సోమవారం భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, కాలువలు పొంగి ప్రవహించాయి. వర్షపు నీటిలో పంట పొలాలు మునిగిపోయాయి. విస్తారంగా వర్షం కురవడంతో దాచేపల్లిలోని నాగులేరులో భారీగా నీరు చేరింది. పలు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. రోడ్లపై నీళ్ల నిలవడంతో వాహనాల రాకపోకలకు కొంతమేర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షంతో రెవెన్యూ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు.


రెంటచింతలలోని శివాలయం సెంటర్లో నివాసాలలోకి వెళ్లిన వర్షపునీరు


మాచర్ల 31వ వార్డులో పొంగి పొర్లుతున్న మురుగు కాల్వ


మాచర్లలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

భారీ వర్షంతో రైతుల్లో ఆనందం

రెంటచింతల: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో రైతుల్లో హర్షం వ్యక్తం అవుతోంది. పొలాల్లో విత్తనం వేసే పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మే, జూన్ నెలల్లో వేసిన పత్తి పంటకు ఈ భారీ వర్షం ఎంతో మేలుచేస్తుందని పలువురు రైతులు అంటున్నారు.

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. రైతులు దుక్కులు దున్నుకుని విత్తనం వేసేందుకు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో మెట్ట పంటలైన పత్తి, మిర్చి పంటల సాగును చేపట్టవచ్చుననే ఆశాభావంతో ఉన్నారు. రెంటచింతలలో 65 మి.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ పరిశీలికులు బద్దిగం ఈశ్వరరెడ్డి తెలిపారు. రెంటచింతల శివాలయం సెంటర్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు నివాసాల్లోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని నున్న గోలి వాగు, పిల్లివాగు, సేంద్రవాగు, ఏడుమంగళం వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.


రెంటచింతలలో వర్షపు నీటితో ముంపునకు గురైన పశువైద్యశాల

క్లుప్తంగా

25న ఐటీఐలో ప్రవేశాలకు కౌన్సెలింగ్

మాచర్ల: ప్రభుత్వ ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 25న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మాచర్ల ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పవన్‌కుమార్ సోమవారం తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి మార్కుల లిస్టు, టీసీ, స్టడీ, క్యాస్ట్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధతో చండీ యాగం



మాచర్ల: పట్టణంలోని శివారు ప్రాంతాల్లో ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ ఆధ్వర్యంలో యోగిత ఆశ్రమంలో సోమవారం భక్తిశ్రద్ధతో చండీ యాగం నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, దీక్షా ధారణ, యాగ సంకల్పం, చండీ పారాయణం, పంచామృత రుద్రాభిషేకాలు జరిపారు. ఎంఎస్ఆర్ టౌన్‌షిప్ అధినేత ఎం.శివరామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల నిరసన



మాచర్ల: పట్టణంలో మున్సిపల్ కార్మికుల నిరసన కొనసాగుతోంది. సీఐటీయూ నాయకుడు బండ్ల మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల్ని పరిష్కరించకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని తెలిపారు. జీవో నంబరు 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. తల్లి వందనం, ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరుతో పాటు గ్రాట్యుటీ అమలు చేయాలని కోరారు. పెరిగిన పట్టణ జనాభాకనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని తెలిపారు. 30 మంది కాంట్రాక్టు కార్మికులు విధులు బహిష్కరించి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ మాచర్ల పట్టణ అధ్యక్షురాలు రమణ, కార్మికులు పాల్గొన్నారు.

కానుకమాత చర్చిలో తేరు ప్రదక్షిణ




రెంటచింతల: రాష్ట్రంలో సకాలంలో మంచి వర్షాలు కురవాలని కోరుతూ స్థానిక కానుక మాత చర్చి ఆవరణలో సోమవారం నుంచి శుక్రవారం వరకు తేరు ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ వైఎల్. మర్రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు సరైన వర్షాలు పడక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. రైతులంతా వర్షం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రతి రోజు సాయంత్రం ఐదు గంటలకు తేరు ప్రదక్షిణ నిర్వహించనున్నట్లు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

గంగమ్మ ఆలయంలో మొక్కలు నాటిన భక్తులు



దాచేపల్లి: నడికుడి రైల్వే స్టేషన్ సమీపంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో సోమవారం భక్తులు మొక్కలు నాటారు. ఇటీవల దేవాలయం చుట్టూ గుంతలను మట్టితో చదును చేశారు. చుట్టూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటరెడ్డి, వీరారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



పిడుగురాళ్ల: పట్టణంలోని అంజిరెడ్డి హాస్పిటల్‌లో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 389 మంది వైద్య సేవలు పొందినట్లు డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీబీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో, ఆల్ట్రా సౌండ్, యూరిన్ టెస్ట్‌తో పాటు రక్త పరీక్షలు ఉచితంగా చేసినట్లు చెప్పారు. శిబిరంలో మూత్ర, గుండె, స్త్రీల సమస్యలు, చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు వైద్యం అందించడంతో పాటు ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. శిబిరంలో డాక్టర్లు లోకిరెడ్డి సుష్మారెడ్డి, బి. వెంకట్రావు, రాజేష్, పి. రామనాథ్‌రెడ్డితోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

పేదలను గుర్తించేందుకు గ్రామాలు, వార్డుల్లో పీ-4 సభలు

మాచర్ల: పీ-4 పథకంలో భాగంగా పేదలను గుర్తించి లబ్ధి చేకూర్చేందుకు భాగంగా గ్రామ, వార్డు సభలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి వేణుబాబు తెలిపారు. మొదటి రోజు సోమవారం 1,2,3,4 వార్డుల్లో నోడల్ ఆఫీసర్లు సభలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.మొత్తం 31 వార్డుల్లో ఆయా నోడల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో టీం వర్క్, సర్వేతో పాటు సభలు జరుపుతామని వివరించారు. ఈ నెల చివరి వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా నిత్య కల్యాణోత్సవం

మాచర్ల: స్థానిక పాత ఊరులో గల శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం నిత్య కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు పలువురు దంపతులు పీటల మీద కూర్చొని పూజలు నిర్వహించారు. నిత్య కల్యాణ మహోత్సవంలో భాగంగా ఉత్సవ విగ్రహాలను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామి కల్యాణాన్ని ఘనంగా జరిపి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవంగా బోనాల జాతర

మాచర్ల: ఆషాఢ మాసం సందర్భంగా నాయీ బ్రాహ్మణుల కుల దేవతలైన గుర్రప్ప స్వామి, మైసమ్మ తల్లికి బోనాల జాతరను సంఘ పెద్దలు మాచర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మైసమ్మ తల్లికి ఉదయం ప్రత్యేక పూజలు జరిపి, శోభాయమానంగా అలంకరించారు. నాయీ బ్రాహ్మణ సంఘీయులంతా పాల్గొని, పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఏర్పాట్లను మాచర్ల నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు పర్యవేక్షించారు. వేడుకల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పట్టణంలోని ప్రధాన సెంటర్‌లోని కోదండ రామాలయం నుంచి పెద్దఎత్తున బోనాలతో మహిళలు దేవాలయం చేరుకుంటారు. ఉత్సవాలను జయప్రదం చేయాలని నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కోరారు.

స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీ ఈశ్వర్‌రెడ్డి

పిడుగురాళ్ల: స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అనుమల లక్ష్మీ ఈశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రజాశక్తి నగర్‌లో గల కన్నెగంటి హనుమంత్ భవనంలో అక్కినపల్లి బాలయ్య అధ్యక్షతన సోమవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. లక్ష్మీ ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అదానీ కంపెనీలకు దోచి పెట్టడానికి స్మార్ట్ మీటర్లు బిగించే కార్యక్రమం తెచ్చినట్లు ఆరోపించారు. వీటి వల్ల ప్రజలపై ఇప్పుడున్న విద్యుత్ భారాల కంటే అదనంగా పడతాయని తెలిపారు. ఎక్కువగా వాడే సమయాల్లో అదనపు చార్జీలు పడతాయని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండి అని పిలుపునిచ్చిన లోకేష్ ఈ రోజు ఇళ్లకు మీటర్లు బిగించాలని ప్రోత్సహిస్తున్నారని ఆయన విమర్శించారు. దీనిపై ప్రజల వద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ, సంతకాలు సేకరణ వంటి కార్యక్రమాలు చేసి చైతన్యవంతం చేస్తామని తెలిపారు. ఆగస్టు 5న విద్యుత్ సబ్ స్టేషన్, సచివాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం నాయకులు నీలాద్రి రాంబాబు, సీపీఐ పల్నాడు ఏరియా కార్యదర్శి మందపాటి రమణారెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు సంద్రపాటి నాగేశ్వరరావు, ఏఎఫ్‌టీయూ న్యూ నాయకులు కొండారెడ్డి, చెన్నయ్య, సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దీకొండ వెంకటేశ్వర్లు, భిక్షాలు, కొంద్రు విజయసారథి, నాగేశ్వరరావు, సాగర్‌బాబు, శ్రీను, షేక్ కరీముల్లా, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టార్గెట్ చేసి.. దొంగిలించేస్తాడు

- తాళం వేసిన ఇంటిలో చోరీ
- హెల్మెట్ ధరించిన దొంగ
- నగదుతో పాటు వెండి, బంగారం చోరీ

యడ్లపాడు: ఇంటికి తాళం పడిందని తెలుసుకున్న దొంగలు ఓ వృద్ధురాలి ఇంటిని టార్గెట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు రూ. 30 వేల నగదుతో పాటు 4 గ్రాముల బంగారం, 40 గ్రాముల వెండి వస్తువులను చోరీ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... యడ్లపాడు మండలం మైదవోలు గ్రామానికి చెందిన బంగారు వరలక్ష్మి హైదరాబాదులో కుమారుడి వద్ద ఉంటూ అప్పుడప్పుడు స్వగ్రామమైన మైదవోలులోని ఇంటికి వచ్చి వెళ్తుంది. ఈనెల 1న మైదవోలు వచ్చి తిరిగి హైదరాబాదుకు వెళ్లింది. అప్పటి నుంచి ఇల్లు తాళం వేసి ఉండటం గమనించిన గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం పొరుగువారు వరలక్ష్మి ఇంటితాళం పగులగొట్టి ఉండటం గమనించి ఆమెకు ఫోన్‌ద్వారా సమాచారం అందించారు. హుటాహుటిన గ్రామానికి వచ్చిన వరలక్ష్మి ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటాన్ని చూసి షాక్‌కు గురైంది. బీరువాలో దాచిన నగదు, వెండి, బంగారం, అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంటనే యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటన స్థలానికి చేరుకొని సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించారు. సీసీ కెమెరాల్లో శనివారం అర్ధరాత్రి సమయంలో హెల్మెట్ ధరించిన దుండగులు ఇంటి ప్రధాన ద్వారం వద్ద తాళం పగలగొట్టి లోనికి వెళ్లిన దృశ్యాలు కనిపించాయి. క్లూస్ టీం ద్వారా ఘటన తాలూకు ఆధారాలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.



జేఎన్‌టీయూఎన్‌లో ఫ్యాకల్టీ అభివృద్ధిపై కార్యక్రమం

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో మల్టీమీడియా క్వాలిటీ అసెస్మెంట్ టెక్నిక్స్, లాటెక్స్ టూల్ అంశంపై ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. చెన్నై ఎస్ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సీఎస్ఈ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.అజయ్ కుమార్ రెడ్డి రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. వివిధ కళాశాలలకు చెందిన 35 మంది అధ్యాపకులు హాజరయ్యారు. మల్టీ మీడియా విశిష్టత, లాటెక్స్ టూల్ మంచి పేపర్స్ పబ్లిష్ చేసేందుకు ఉపయోగాన్ని తెలియజేశారు. ఓంని డైరెక్షనల్ అండ్ స్టేర్‌స్కోపిక్ ఇమేజెస్ క్వాలిటీ అసెస్మెంట్, లాటెక్స్ మీద హ్యాండ్స్ ఆన్ సెషన్ తీసుకున్నారు. చైర్మన్, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ లాటెక్స్ టూల్ వినియోగం కలిగే ప్రయోజనాలను వివరించారు. రీసోర్స్‌పర్సన్ అజయ్‌కుమార్ ఈ రంగంలో ఉన్న అనుబంధాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో నేర్చుకున్న మెథడాలజీని కళాశాలలో టీచింగ్‌లో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.ఎస్.కిషోర్ బాబు, కన్వీనర్ డాక్టర్ ఎ.గంగాధర్, ఎఫ్‌డీపీ కో ఆర్డినేటర్ సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ పి.అజయ్‌కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపల్

మున్సిపల్ కార్మికుల అర్ధ నగ్న ప్రదర్శన



పిడుగురాళ్ల: మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మెను కొనసాగిస్తానని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సమ్మె శిబిరం సోమవారంతో 9వ రోజుకు చేరింది. ప్రభుత్వ నిర్లిప్తతను నిరసిస్తూ కార్మికులు బ్యాంక్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్, గంగమ్మతల్లి గుడి వద్ద నుంచి ఐలాండ్ సెంటర్ వరకు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికులను రోడ్డుపై పడవేసిందని, సమస్యలను పరిష్కరించడానికి ఏ మాత్రం స్పందించడం లేదని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



నరసరావుపేట టౌన్: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ సీఐ సీహెచ్ లోకనాథం అన్నారు. సోమవారం మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నిబంధనలకు లోబడి వాహనాలు నడిపితే ప్రమాదాలు దరిచేరవు అన్నారు. వాహనాలు నడిపేవారు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణం ప్రమాదకరమన్నారు. సమాజంలో చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలకు కారణం నిబంధనలు పాటించకపోవటమేనన్నారు. ట్రాఫిక్ ఎస్ఐ వేణు, సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖాతాదారుల విస్తృత ప్రయోజనాలకు కృషి

కళాకారులతో కలిసి ప్రచారం చేస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

మాచర్ల: కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడు నెలలు ఆర్థిక కేంద్రీకృత ప్రయత్న కార్యక్రమంలో భారీ స్థాయిలో ఖాతాలు నమోదుతో పాటు ఖాతాదారుల విస్తృత ప్రయోజనాలకు కృషి చేస్తున్నట్లు కెనరా బ్యాంక్ అధికారులు తెలిపారు. పట్టణంలో రెండు రోజులుగా బ్యాంక్ ఆధ్వర్యంలో కళాకారులతో కలిసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ జులై నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు ఆన్‌లైన్ మోసాలపై ప్రచారం చేసేందుకు విస్తృతంగా ప్రతి గ్రామ పంచాయతీలో శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజలంతా అవగాహన పెంచుకుని ఖాతాదారులుగా చేరాలని వారు కోరారు.


ప్రచారాన్ని నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ అధికారులు

పని చేయని ఫోన్లతో అంగన్‌వాడీలకు అవస్థలు

పిడుగురాళ్ల: పని చేయని ఫోన్లు తక్షణమే వెనక్కి తీసుకోవాలని, అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రాజెక్టు కార్యదర్శి బి. శాంత కోరారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయంలోని సూపర్‌వైజర్లు నాగమణి, వెంకటలక్ష్మీలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు కార్యదర్శి డి. శాంత మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు పని చేయని ఫోన్లు ఇవ్వడం వల్ల సిగ్నల్స్ అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రకరకాల యాప్‌లు ఉండటం వల్ల గందరగోళంగా ఉందని, అన్ని కలిపి ఒకటిగా ఏర్పాటు చేయాలని కోరారు. పని చేయని ఫోన్లు తీసుకొని వాటి స్థానంలో 5జీ ట్యాబ్‌లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించే విధంగా ప్రభుత్వం జీవో ఇవ్వాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కాన్వెంట్ బిల్లులు తక్షణమే ఇవ్వాలని, నిబంధనలు లేకుండా అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లందరికీ తల్లికి వందనం అందజేయాలని కోరారు.ఉచిత గ్యాస్‌ను అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


సూపర్‌వైజర్లకు వినతి పత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జీవన ఎరువులను వినియోగించాలి

నరసరావుపేట రూరల్: రసాయన ఎరువులకు బదులు జీవన ఎరువులు వినియోగించడం వలన నేల భౌతిక స్వరూపం మారకుండా ఉంటుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. మండలంలోని పాలపాడులో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు శిక్షణశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పంటలను భూమిలో కలియదున్నడం వలన భూసారాన్ని పెంచుకోవడంతో పాటు రసాయన ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని తెలిపారు. రసాయన ఎరువులు కాకుండా జీవన ఎరువులైన ఫాస్పరస్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియాను వాడటం వలన ఖర్చు తగ్గుతుందని సూచించారు. వరి, మొక్కజొన్న పంటల్లో కలుపు యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలు గురించి తెలియజేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో వరి సాగు చేసే రైతులు ఎకరానికి రూ.80లు ప్రీమియంగా చెల్లించి ఆగస్టు 15వ తేదీలోగా బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.శాంతి, గ్రామ పెద్దలు పి.రామిరెడ్డి, వై.లింగయ్య, వ్యవసాయ సహాయకుడు వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ అమ్మవారికి ఆషాఢ సారె


సారెను తీసుకు వస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు

పిడుగురాళ్ల: ఆషాఢ మాస చివరి రోజు పురస్కరించుకొని కనకదుర్గమ్మ దేవాలయం కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో జానపాడు రోడ్డులోని వాసవీ అమ్మవారికి సోమవారం సారెను సమర్పించారు. అనంతరం అమ్మవారిని సారెతో అందంగా అలంకరించారు. భక్తులు దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.